సాక్షి
ప్రకాశం

శుక్రవారం | 1 | డిసెంబర్ | 2023



జీజీహెచ్‌కి పుష్కలంగా నీరు
ఒంగోలులోని జీజీహెచ్‌కి పుష్కలంగా నీరందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.
- 8లో..



వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి
ఒంగోలు రిమ్స్‌లోని వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని స్థానిక డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డి సూచించారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
28/24

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఒంగోలులో 30 పోలీస్ యాక్ట్

ఒంగోలు సబర్బన్: ఒంగోలు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో డిసెంబర్ 1వ తేదీ నుంచి 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి తెలిపారు. గురువారం మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ యాక్ట్‌ను అమలులో పెట్టామన్నారు. అందుకుగాను ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఇతర యూనియన్లు, రాజకీయ పార్టీలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు చేయాలంటే పోలీస్ ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం


చెక్కు అందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: పోలీసుల కుటుంబాలకు ఎల్ల వేళలా అండగా ఉంటామని ఎస్పీ మలికాగర్గ్ చెప్పారు. కొనకనమిట్ల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ గుండె పోటుతో మృతి చెందిన షేక్ అస్లాం సాహెబ్ (ఏఎస్సై-1670)కు స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో గురువారం నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులకు ఆర్థికసహాయం అందిస్తూ చెక్కు పంపిణీ చేశారు.

రుణ సౌకర్యంపై హర్షం

ఒంగోలు సెంట్రల్: దివ్యాంగుల స్వయం సహాయక సంఘాల వారికి రుణ సౌకర్యం కల్పించాలని మెప్మా ఏపీ డైరెక్టర్ విజయలక్ష్మి ఆదేశాలిచ్చారు. దీంతో నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా గురువారం హర్షం వ్యక్తం చేశారు. మెప్మా ఏపీ డైరెక్టర్ విజయలక్ష్మిని ముందుగానే కలిసి తాము దివ్యాంగుల దినోత్సవం నిర్వహణపై కూడా విన్నవించామన్నారు. దివ్యాంగులు ఆర్థికంగా ఎదిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరిన వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సర్క్యులర్ జారీ చేశారన్నారు. జిల్లా అధ్యక్షుడు భాను ప్రకాశ్, షేక్ నజీర్ అభినందనలు తెలిపారు.

అభాగ్యులకు బాసటగా..!

తమ రోగాన్ని చెప్పుకోలేని అభాగ్యులు.. తెలిసోతెలియకో చేసిన తప్పునకు ప్రాణాంతక వ్యాధి బారినపడి నరకం అనుభవిస్తున్నారు. హెచ్‌ఐవీ వ్యాధి సోకి ప్రాణాలతో పోరాడుతున్న అలాంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎయిడ్స్ నివారణకు పక్కాగా అడుగులు వేస్తోంది. కొత్త కేసులు నమోదు కాకుండా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఏఆర్టీ సెంటర్ల ద్వారా ఖరీదైన మందులు అందిస్తోంది. నెలనెలా వారి బ్యాంక్ ఖాతాల్లో పెన్షన్ నగదు జమ చేస్తోంది. జిల్లాలోని ఒంగోలు, మార్కాపురంలో ఏఆర్టీ సెంటర్ల ద్వారా చికిత్స అందిస్తోంది. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యలతో హెచ్‌ఐవీ కేసులు తగ్గుముఖం పట్టడంతో పాటు బాధితులకు భరోసా లభిస్తోంది. నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం...



- హెచ్‌ఐవీ రోగులకు ప్రతి నెలా పెన్షన్ అందిస్తున్న ప్రభుత్వం
- నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
- ఉచితంగా ఏఆర్టీ మందుల పంపిణీ
- తల్లి నుంచి బిడ్డకు సంక్రమించకుండా పీపీటీసీటీలో కాన్పులు
- ప్రజల భాగస్వామ్యంతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
- ప్రభుత్వ చర్యలతో గణనీయంగా తగ్గుముఖం పట్టిన హెచ్‌ఐవీ కేసులు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం

ఒంగోలు టౌన్: ఎయిడ్స్ అంటే ఒక ప్రాణాంతక వ్యాధి.. ఇదంతా ఒకప్పటి మాట. గతంలో ప్రజలను భయాందోళనకు గురిచేసిన హెచ్‌ఐవీని ఇప్పుడు సాధారణ వ్యాధిగా పరిగణిస్తున్నారు. ఒక వైపు శాస్త్రజ్ఞుల పరిశోధనలు, మరోవైపు ప్రభుత్వాల పట్టుదల వెరసి క్రమంగా హెచ్‌ఐవీ కనుమరుగయ్యే సూచనలు కనిపిస్తున్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికిప్పుడైతే వ్యాధిని పూర్తిగా నిర్మూలించలేకపోయినప్పటికీ.. దాన్ని కట్టడి చేయడంలో మాత్రం పైచేయి సాధించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. హెచ్‌ఐవీని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇప్పుడిప్పుడే మంచి ఫలితాలిస్తున్నాయి. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారికి అన్ని విధాలుగా అండగా నిలబడుతూ రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇస్తోంది. ఉచితంగా వైద్యం అందించడంతో పాటు నెలనెలా పెన్షన్ అందిస్తోంది. తల్లి నుంచి బిడ్డకు హెచ్‌ఐవీ సంక్రమించకుండా పీపీటీసీటీ ద్వారా కాన్పులు చేస్తోంది.

జిల్లాలో 2,500 మందికి ప్రతి నెలా రూ.2,750 పెన్షన్...

వితంతువులు, వృద్ధులకు ఇస్తున్నట్లే హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.2,750 పెన్షన్ ఇస్తోంది. ఆ డబ్బును వారి చేతికి అందజేయకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తోంది. ఇది హెచ్‌ఐవీ రోగులకు ఎంతో ఉపయోగపడుతోంది. ప్రస్తుతం జిల్లాలో ప్రతి నెలా 2,500 మంది హెచ్‌ఐవీ పెన్షన్లు తీసుకుంటున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2009లో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పెన్షన్‌ను ప్రారంభించారు. అప్పుడు రూ.1000 పెన్షన్ ఇచ్చేవారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వాన్ని పెన్షన్ పెంచాలని కోరినప్పటికీ చంద్రబాబు పట్టించుకోలేదు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్‌ను ఏకంగా రూ.2,750కు పెంచి ప్రతి నెలా క్రమం తప్పకుండా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

తల్లి నుంచి బిడ్డకు సంక్రమించకుండా కాన్పులు...

హెచ్‌ఐవీ బారినపడిన దంపతులు బిడ్డలను కనాలంటే గతంలో ఎన్నో ఇబ్బందులు ఉండేవి. వారి ద్వారా సంతానానికి కూడా హెచ్‌ఐవీ సోకే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. అందువలన బిడ్డలను కనేందుకు ధైర్యం చేసేవారు కాదు. అయితే ప్రివెన్షన్ ఆఫ్ పేరెంట్ టు చైల్డ్ ట్రాన్స్‌మిషన్ (పీపీటీసీటీ) కేంద్రాల్లో కాన్పులు చేసిన వెంటనే పసిబిడ్డకు నివిరాపిన్ టానిక్ ఇవ్వడం ద్వారా తల్లి నుంచి బిడ్డకు హెచ్‌ఐవీ సోకకుండా జాగ్రతలు తీసుకుంటున్నారు. దీంతో ఇప్పుడు హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారు కూడా నిరభ్యంతరంగా పిల్లలను కనే అవకాశాలు ఉన్నాయి. గత రెండేళ్లలో తల్లిదండ్రుల నుంచి పిల్లలకు హెచ్‌ఐవీ సోకకుండా చేయడంలో నూటికి నూరు శాతం విజయం సాధించారు. హెచ్‌ఐవీ సోకిన దంపతులు ప్రైవేటు ఆస్పత్రులు, గ్రామీణ వైద్యుల వద్ద కాన్పులు చేయించకుండా తప్పనిసరిగా పీపీటీసీటీ కేంద్రాల్లో మాత్రమే కాన్పులు చేయించుకోవడం ద్వారా వారి సంతానం హెచ్‌ఐవీ బారిన పడకుండా కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

ఏఆర్టీ సెంటర్ల కీలకపాత్ర...

హెచ్‌ఐవీ నిర్ధారణ, చికిత్సలో ఏఆర్టీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రతి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో హెచ్‌ఐవీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అక్కడ పాజిటివ్ వచ్చిన కేసులను వెంటనే నిర్ధారించకుండా ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ)లకు పంపిస్తారు. జిల్లాలో 16 ఐసీటీసీ సెంటర్లు ఉన్నాయి. అక్కడ ఎలిసా, కూంబ్ టెస్టులు నిర్వహించిన తర్వాతే వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. అక్కడి నుంచి ఏఆర్టీ సెంటర్‌కు పంపించి అత్యంత ఖరీదైన యాంటీ రిట్రో వైరల్ ఔషధాలను ఉచితంగా ఇస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం, చీరాలలో ఏఆర్టీ కేంద్రాలు ఉండగా, ఇటీవల ఒంగోలు ఏఆర్టీ సెంటర్‌ను ఏఆర్టీ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఏఆర్టీ ఔషధాలు పనిచేయని పరిస్థితి వచ్చినప్పుడు అడ్వాన్స్ స్టేజ్ మందులు కూడా ఒంగోలు సెంటర్లో అందిస్తారు.

నిర్మూలనలో ప్రజలది ప్రధానపాత్ర...

ఇప్పటివరకు ప్రభుత్వం ఎన్జీఓ సంస్థలతో కలిసి హెచ్‌ఐవీ నివారణ కోసం సంయుక్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం లెట్ కమ్యూనిటీస్ లీడ్ పేరుతో ప్రజలే ప్రధాన పాత్ర పోషించాలన్న నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా ఒకరి నుంచి మరొకరికి ఇన్‌ఫెక్షన్లు సోకకుండా ఆపడం, హెచ్‌ఐవీ మరణాలు తగ్గించడం, వైరస్‌తో జీవిస్తున్న వారిపై సాంఘికంగా, ఆర్థికంగా ప్రభావం లేకుండా చూడటం ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించినట్లు అధికారులు చెబుతున్నారు.


మార్కాపురంలోని ఏఆర్‌టీ సెంటర్

పశ్చిమ ప్రకాశంలో 9 వేలకుపైగా కేసులు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో 9 వేల మందికిపైగా ఎయిడ్స్ బాధితులున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వారిలో మార్కాపురం జిల్లా వైద్యశాలలోని ఏఆర్‌టీ సెంటర్‌లో నమోదైన 6,148 మందికి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారు ఒంగోలు, గుంటూరు విజయవాడ వెళ్లడంతో పాటు ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స చేయించుకుంటున్నారు. గతేడాది 5,895 కేసులు మాత్రమే ఉండగా, ఈ ఏడాది అదనంగా 253 కేసులు నమోదయ్యాయి. సురక్షితం కాని శృంగారం, ఇన్‌ఫెక్టెడ్ నీడిల్స్, ఇన్‌ఫెక్టెడ్ రక్తాన్ని మరొకరికి ఎక్కించడం, గర్భిణిగా ఉన్నప్పుడే ఎయిడ్స్ సోకి తల్లి నుంచి బిడ్డకు వ్యాపించడం ద్వారా హెచ్‌ఐవీ వ్యాప్తి చెందుతోంది. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కొమరోలు, పుల్లలచెరువు, అర్ధవీడు, కంభం, తదితర ప్రాంతాల్లో హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య కాస్త పెరుగుతున్నట్లు ప్రభుత్వ రికార్డులు వెల్లడిస్తున్నాయి. వెనుకబడిన పశ్చిమ ప్రకాశం నుంచి ఉపాధి కోసం ప్రజలు సంవత్సరంలో 8 నెలల పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, చెన్నై, బెంగళూరుకు కుటుంబాలను వదిలి వలసలు పోతుంటారు. ఇది వారికి శాపంగా మారుతోంది. ఎక్కువగా ఆటో, లారీ డ్రైవర్లు, వలస కూలీలు, పలకల కార్మికులు ఎయిడ్స్ బారిన పడుతున్నారు. వీరిలో ఎక్కువ మంది 20 నుంచి 30 సంవత్సరాల్లోపు వారు కావడం గమనార్హం.

క్రమం తప్పకుండా మందులు వాడాలి



హెచ్‌ఐవీ ఇప్పుడు ఒక సాధారణ వ్యాధి మాత్రమే. దీనికి వైద్యులు సూచించినట్లు క్రమం తప్పకుండా మందులు వాడాలి. చక్కటి వ్యాయామం చేయాలి. దురలవాట్లకు దూరంగా ఉండాలి. మంచి పోషకాహారం తీసుకోవాలి. ఒక వేళ ఎవరైనా ఎటువంటి పరిస్థితుల్లోనైనా ఏఆర్టీ మందులను మధ్యలో వాడటం ఆపేస్తే డ్రగ్ రెసిస్టెంట్ అవుతుంది. అప్పుడు మరింత ప్రభావవంతమైన మందులు వాడాల్సి వస్తుంది. ఇది మంచిది కాదు. మందులతో పాటుగా సానుకూల దృక్పథంతో జీవించడం వలన వైరస్ ప్రభావం తగ్గుతుంది. మందులు కూడా మరింత ప్రభావవంతంగా పనిచేస్తాయి.

– **డాక్టర్ జోసెఫ్ శామ్యూల్**, ఏఆర్టీ ప్లస్ సీనియర్ మెడికల్ ఆఫీసర్, ఒంగోలు

అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం



హెచ్‌ఐవీ ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్‌బ్యాంకులను తరచూ తనిఖీ చేసి నిర్వాహకులు కచ్చితంగా నిబంధనలు అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలను చైతన్యవంతం చేయడమే కాకుండా వారికి అవగాహన కల్పించేందుకు తగిన కార్యాచరణ అమలు చేస్తున్నాం. ఎవరికైనా హెచ్‌ఐవీ సోకినట్లు అనుమానం కలిగిన వెంటనే వైద్యులను సంప్రదించి సలహా తీసుకోవడం ఉత్తమం.

– **డాక్టర్ సురేష్‌కుమార్**, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ అధికారి

హెచ్‌ఐవీని ఇలా గుర్తించవచ్చు



హ్యూమన్ ఇమ్యునో డెఫిసియన్సీ వైరస్ (హెచ్‌ఐవీ)ని గుర్తించడానికి ఏఆర్‌టీ సెంటర్‌లో కొంబెడ్స్, ట్రై లైన్, ట్రై స్పాట్ పరీక్షలు నిర్వహిస్తారు. వాటిలో పాజిటివ్ వస్తే హెచ్‌ఐవీగా నిర్ధారిస్తారు. అనంతరం సీడీ 4 టెస్ట్‌లో తెల్ల రక్తకణాల సంఖ్య 350 కంటే తక్కువగా ఉంటే వారికి జీవితకాలం ప్రతి నెలా ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుంది. వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రజలకు వివరిస్తున్నాం. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం మెరుగైన మందులు సరఫరా చేస్తోంది. అంతేగాకుండా ఏఆర్‌టీ సెంటర్లలో బాధితులకు హెపటైటిస్ బీ, సీ టెస్టులు నిర్వహించి పాజిటివ్ వస్తే మందులిస్తాం. నెగెటివ్ వస్తే లివర్ సంబంధిత వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తగా టీకా వేస్తాం.

– **డాక్టర్ సీహెచ్ సాయికిరణ్**, ఏఆర్‌టీ సెంటర్, మార్కాపురం జిల్లా వైద్యశాల

ప్రచార యావ లేదు.. అభివృద్ధే ప్రధానం


కొప్పోలు-గుత్తికొండవారిపాలెం రోడ్డులో నూతనంగా నిర్మించిన వంతెనను ప్రారంభిస్తున్న బాలినేని, గంగాడ, నాయకులు


కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, తదితరులు

- టీడీపీ గత ఐదేళ్ల పాలనలో శివారు ప్రాంతాలను విస్మరించారు
- ప్రస్తుతం మాపై దామచర్ల అసత్య ప్రచారం చేస్తున్నారు
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ఒంగోలు సబర్బన్: నాకు ప్రచార యావలేదు.. పత్రికల్లో, టీవీల్లో కనపడాలని నేను మాట్లాడను.. ప్రజల సమస్యలు తీర్చడం, అభివృద్ధి పనులు చేసుకుంటూ పోవడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతాను అని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కొప్పోలు-ఇందిరమ్మకాలనీల మధ్య ఒంగోలు 9వ డివిజన్‌లోని ఇందిరమ్మకాలనీ ఒకటో లైన్ ప్లాట్‌ఫాం నంబర్-53 నుంచి గుత్తిగొండవారిపాలెం రోడ్డు కల్వర్టు వరకు కోటి రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బాలినేని శంకుస్థాపన చేశారు. అనంతరం కొప్పోలు గుత్తిగొండవారిపాలెం మధ్యలో పోతురాజుకాలువ ఆధునికీకరణ (ఫేజ్-2)లో భాగంగా రూ.89.75 కోట్లతో పోతురాజుకాలువపై నూతనంగా నిర్మించిన వంతెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. తాను అభివృద్ధి చేయలేదని ఆరోపణలు చేస్తున్నాడన్నారు. 9వ డివిజన్‌లో రూ.6 కోట్లతో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించామన్నారు. రూ.1.40 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించామని తెలిపారు. దామచర్ల ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పూర్తిగా శివారు ప్రాంతాలను విస్మరించారన్నారు. ప్రస్తుతం తనపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఏమీ చేయలేదనటం సరికాదన్నారు. ప్రచారం చేసుకోవడం తమ పని కాదని, ప్రజల అవసరాలు తీర్చడంతో పాటు అభివృద్ధి పనులు చేయడమే పనిగా పెట్టుకున్నామని బాలినేని స్పష్టం చేశారు. ఒంగోలు నగరంలో దశాబ్దాల నుంచి నెలకొన్న హైటెన్షన్ విద్యుత్ లైన్ సమస్యను అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులు చేపట్టి పరిష్కరించామన్నారు. ఆ సమస్య వల్ల ఎక్కువ లబ్ధిపొందేది దామచర్లకు చెందిన సామాజికవర్గం వారేనన్నారు. అయినా ఓట్ల రాజకీయం చేయడం తనకు తెలియదన్నారు. సామాజికవర్గాల వారీగా పనులు చేయడం తనకు చేతకాదని, అందరినీ తన ప్రజలగానే చూసుకుంటానని బాలినేని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, యువజన విభాగం అధ్యక్షుడు ఘంటా రామానాయుడు, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, ఒంగోలు ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, కార్పొరేటర్లు వెన్నపూస శోభారాణి వెంకటరెడ్డి, బెంగళూరు నర్సయ్య, యనమల నాగరాజు, ఈదర సురేష్‌బాబు, జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టు ఎస్‌ఈ అబూతలేం, పోతురాజు కాలువ కాంట్రాక్టర్ ఎస్.విజయ భాస్కరరెడ్డి, చింతగుంట్ల సువర్ణ, అయినాబత్తిన ఘనశ్యాం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాకల విద్యార్థినులు

సింగరాయకొండ: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆరుగురు ఎంపికైనట్లు కబడ్డీ కోచ్ పిల్లి హజరత్తయ్య తెలిపారు. పాఠశాల విద్యార్థినులు కె.నందిని, కె.భూమిక, వి.అర్చన, కె.విజయలక్ష్మి, వి.అపర్ణ, కె.సౌమ్య రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరు కర్నూలు జిల్లా గోనెగండ్లలో డిసెంబర్ 1న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

జనగళం


బడిని చూస్తే ముచ్చటేస్తోంది

నాడు-నేడు ద్వారా పిల్లలు చదువుకొనే బడులను అభివృద్ధి చేయటంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న బడులను చూస్తే ముచ్చటేస్తుంది. బాగా చదువుకోవాలనే కోరిక పుడుతుంది. అన్నీ తరగతుల విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించటంతో పాటు త్వరలో కస్తూరిబా బాలికలకు పడుకొనేందుకు పరుపులతో కూడిన బెడ్లు ఏర్పాటు చేస్తుండటం సంతోషంగా ఉంది. మా పాఠశాలలో ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ పర్యవేక్షణలో కొంత టైమ్ కేటాయించి పాఠశాలలో మొక్కలు నాటడం, స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పిల్లలందరం పాల్గొని ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చటానికి కృషి చేస్తున్నాం.



– **జి.నందిని**, విద్యార్థిని, కెజిబివి పాఠశాల, గొట్లగట్టు

పాఠశాల రూపురేఖలు మారాయి



నాడు-నేడుతో మా పాఠశాలకు అవసరమైన అదనపు తరగతి గదులు, మౌలిక వసతులు కల్పించటంతో పాఠశాల రూపురేఖలు మారాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఆహ్లాదకరంగా ఉన్నాయి. తరగతి గదుల్లో విద్యార్థులకు అనువుగా బెంచీలు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు, ఆటస్థలం అభివృద్ధి, ప్రహరీ, మినరల్ వాటర్ ఏర్పాటు చేశారు. అన్నీ సబ్జెక్టులకు అవసరమైన ఉపాధ్యాయుల నియామకం, విద్యార్థులకు డిజిటల్ తరగతులు, నాణ్యమైన భోజనం, పుస్తకాలతో పాటు అన్నీ వసతులు కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలు, చదువుకు ప్రాధాన్యత ఇవ్వటం అభినందనీయం.

– **మండ్లా రామాంజనేయులు**, సైన్స్ టీచర్, జెడ్పీ ఉన్నత పాఠశాల, మద్రిపాలెం, కొనకనమిట్ల మండలం

సచివాలయంలోనే పంట సాగు పత్రం



పొలం కౌలుకి తీసుకొని పంట సాగుచేస్తున్నా. జగనన్న సురక్ష కార్యక్రమంలో పంట సాగు హక్కు పత్రం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా వలంటీరు వచ్చి అవసరమైన సర్టిఫికెట్లు తీసుకొని ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పంట సాగు హక్కు పత్రం ఇచ్చారు. ఇకపై రైతు భరోసా, పంట నష్ట పరిహారం, తదితర ప్రభుత్వ పథకాలకు అర్హత పొందాను. సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

– **బొలినేని నాగయ్య**, పొందూరు గ్రామం, టంగుటూరు మండలం



క్లుప్తంగా

పలకల క్వారీలో కార్మికుడు మృతి



బుడ్డపల్లిలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై సుధాకర్

తర్లుపాడు: పలకల క్వారీలో రాయి జారి మీద పడటంతో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఎస్సై వేముల సుధాకర్ కథనం మేరకు.. తర్లుపాడు మండలంలోని బుడ్డపల్లెకు చెందిన అంగిరేకుల సాయన్న(75) గ్రామ సమీపంలోని పలకల గనిలో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి గనిలో నుంచి పలకరాయిని తీసి చక్కదిద్దే క్రమంలో ప్రమాదవశాత్తు రాయి విరిగి మీద పడింది. తీవ్రంగా గాయపడిన సాయన్నను నర్సరావుపేటలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాదకద్రవ్యాలతో జీవితం అధోగతి

- స్టెప్ సీఈవో యంబీఎస్ లోకేశ్వరరావు

ఒంగోలు: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్టెప్ సీఈఓ ఎంబీఎస్ లోకేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో మాదకద్రవ్యాల నిరోధం, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సును శిక్షణ, ఉపాధి ప్రోత్సాహక సంస్థ, యువజన సంక్షేమ శాఖ నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన స్టెప్ సీఈఓ మాట్లాడుతూ.. వ్యసనాలకు దూరంగా ఉండగలిగితేనే యువత విజయం సాధించగలరన్నారు. మత్తు పదార్థాల వాడకంతో శారీరక, మానసిక బలాన్ని కోల్పోతారని చెప్పారు. మత్తు పదార్థాలు సేవించిన, కలిగి ఉన్న వారికి విధించే శిక్షల గురించి వివరించారు. యువతకు దిశ యాప్ గురించి దిశ పోలీస్ స్టేషన్ ఏఎస్సై గౌతమి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ సీఈఓ కె.వెంకటేశ్వరరావు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌కి పుష్కలంగా నీరు

- నీటి అవసరాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బాలినేని
- సత్యసాయి ట్రస్ట్ అల్పాహారం పథకం, మెడికల్ హాస్టల్లో రూ.లక్ష సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ప్రారంభం
- పూర్తి స్థాయిలో ఎమ్ఆర్ఐ సేవలకు సిబ్బందిని నియమిస్తాం : ఎంపీ మాగుంట



అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని, పక్కన ఎంపీ మాగుంట, కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు టౌన్: రోజూ వేలాది మంది ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్న జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రిలో నీటి అవసరాల కోసం తాజా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం రిమ్స్ కళాశాలలో జరిగిన జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి ఆసుపత్రిలో సమస్యలు, అభివృద్ధి పనులు, పైప్‌లైన్‌తో నీటి సరఫరా తదితర విషయాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. సొంత నిధులతో ఇచ్చిన అంబులెన్స్‌కు డ్రైవర్ జీతాన్ని తాను భరిస్తానని హామీ ఇచ్చారు. అత్యవసర సమయాల్లో ఆరోగ్య శ్రీ నిధులను వినియోగించుకునేందుకు కమిటీకి ఆమోదం తెలిపారు. ఇటీవల మెడికల్ కళాశాలలో జరిగిన ఘటన దురదృష్టకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫార్మసి షెడ్ కోసం ప్రతిపాదనలు పంపాలని, ప్రస్తుతానికి క్యాంటీన్ భవనాన్ని వినియోగించుకునే విషయాన్ని పరిశీలించాలని కమిటీ కోరింది. ఎమ్మారై సేవలను పూర్తి స్థాయిలో అందించేందుకు సిబ్బందిని నియమిస్తామని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. రిఫరల్ కేసులు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.



మెడికల్ కాలేజీలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాగుంట, బాలినేని, కలెక్టర్

మెడికల్ కాలేజీలో ఆర్వో ప్లాంట్ల ప్రారంభం

ఎమ్మెల్యే బాలినేని తన సొంత నిధులతో మెడికల్ కాలేజీ బాయ్స్, గర్ల్స్ హాస్టల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లను ఎంపీ మాగుంట, కలెక్టర్ దినేష్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం జీజీహెచ్ ఆవరణలో సత్యసాయి ప్రేమ సేవా ట్రస్ట్ నిర్వహిస్తున్న సత్యసాయి ప్రసాద్ క్యాంటీన్‌లో సాయంత్రం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పటికే మధ్యాహ్నం ఉచితంగా భోజనం అందజేస్తుండగా ఇప్పుడు బాలినేని సొంత నిధులతో సాయంత్రం కూడా అల్పాహారం అందజేయనున్నారు. రోజూ 400 మందికి ఉచితంగా ఆహారాన్ని అందించే ఈ కార్యక్రమానికి బాలినేని తోడ్పాటు ఇవ్వడం మరిచిపోలేమని నిర్వాహకులు కొనియాడారు. ఇటీవల మెడికల్ కాలేజీలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థుల వినతిపై స్పందించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తన తలిదండ్రుల పేరు మీద ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని పలువురు వైద్య విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ తిరుమలరావు, కార్పొరేటర్లు చిన్నారి, నాగరాజు, పార్టీ నాయకులు కఠారి శంకర్, గోలి తిరుపతిరావు, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



మెడికోలతో మాట్లాడుతున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, పక్కన ప్రిన్సిపాల్ ఏడుకొండలు

- డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

ఒంగోలు టౌన్: ఎంతో కష్టపడి చదివి, ఇంకెంతో ఇష్టపడి మెడికల్ సీటు సాధించిన వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి హితవు పలికారు. గురువారం స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2023 బ్యాచ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు రావడం ఎంతో అదృష్టమని, ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని శ్రద్ధగా చదివి తలిదండ్రులు, గురువులు, దేశానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఇటీవల కాలేజీలో జరిగిన ఘటనలు దురదృష్టకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యార్థుల మీద కూడా ఉందన్నారు. జులాయిలు పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగడాన్ని అర్థం చేసుకోవచ్చని, కానీ రేపటి డాక్టర్లుగా గౌరవాన్ని పొందాల్సిన వైద్య విద్యార్థులు ఘర్షణపడి పోలీసుల చుట్టూ తిరగడం సబబుగా లేదన్నారు. కోరి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని, మంచి వైద్యులుగా ఎదిగి సమాజం నుంచి మన్ననలు, ప్రజల నుంచి ఆదరణ పొందాలని హితబోధ చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులంటే సమాజంలో ఎంతో గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. పిల్లలు మెడిసిన్ చదువుతున్నారని తలిదండ్రులు ఎంతో గొప్పగా చెప్పుకుంటారన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. అనంతరం.. తాత్కాలిక సంతోషాల కోసం చెడు మార్గంలో నడవబోమని, తలిదండ్రులకు తలవంపులు తీసుకురామని, క్రమశిక్షణతో చదువుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ, వార్డెన్ డాక్టర్ జి.సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందాలి

- ఆయుష్ జోన్-3 రీజినల్ డైరెక్టర్ పద్మజాతి



రికార్డులు పరిశీలిస్తున్న ఆయుష్ జోన్-3 రీజినల్ డైరెక్టర్ పద్మజాతి

సింగరాయకొండ: ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించాలని వైద్య సిబ్బందిని ఆయుష్ జోన్-3 గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల రీజినల్ డైరెక్టర్ జి.పద్మజాతి ఆదేశించారు. గురువారం సింగరాయకొండలోని ఆయుర్వేద ఆస్పత్రితోపాటు పలుకూరు హోమియో, కందుకూరు హోమియో, ఆయుర్వేదిక్, పొన్నలూరు ఆయుర్వేదిక్, గుడ్లూరు యునాని ఆస్పత్రులను ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. సింగరాయకొండ, పొన్నలూరు ఆయుర్వేద వైద్యురాలు కేవీ పద్మజ కుమారి, కందుకూరు, పలుకూరు హోమియో వైద్యురాలు పి.రత్నావళి, కందుకూరు ఆయుర్వేద వైద్యురాలు ఆర్‌టీఎస్ లక్ష్మీకుమారి, గుడ్లూరు యునాని ఆస్పత్రి వైద్యురాలు విమలకుమారి పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED

Society for Social Transformation, NGO Wanted Counsellors/ Trainers for its CFL Project of DEAF-RBI and Canara Bank at Ongole, Yarragondapalem, Markapuram, Mundlamuru, Donakonda, Podili, Kanigiri Mandal HQs of Prakasam District. Locals and nearby Mandal Candidates only need to apply.

Salary is Rs.17,000 pm including travel.

Degree with Computer Knowledge and Training experience required. Selected Trainer needs to mobilise women/youth/farmers etc. & Conduct Trainings and liaison with Banks & Government offices.

Send your CV to sstcfldeprakasam@gmail.com by 8th December 2023. Shortlisted candidates will be called for interview. Don't believe mediators.

V.Anjaneyulu, Project Director, SST NGO
Contact District Coordinator: 99486 85420

సాక్షి క్లాసిఫైడ్స్

Education

సెంట్రల్ పోలీస్ (SSC-GD)

■యువతి, యువకులకు 26,146 CRPF, CISF, BSF, ITBP, SSB కానిస్టేబుల్ ఉద్యోగాలు కలవు. అ:10thపాస్, వ:18-28 (23సం॥ అనుభవం-గత ఫలితాలు గల సంస్థ) స్టార్ డిఫెన్స్ అకాడమి, నంద్యాల, సెల్: 8790844959. [L-806252]

SSC(GD), రైల్వే, ఆర్మీ, ఉద్యోగాలు

■10thపాస్‌తో CRPF, CISF, BSF ఉద్యోగాలు, రైల్వే గ్రూప్-డి, రైల్వే పోలీస్ RPF, ఆర్మీ ఉద్యోగాలకు జాబ్ గ్యారెంటీతో శిక్షణ. స్వల్ప ఫీజు, ఉచిత బుక్స్, హాస్టల్, గ్రౌండ్ సిద్ధార్థ అకాడమీ, నంద్యాల. 90103 63553 [L-781168]

Services

■వ్యవసాయ భూములకు, రైతులకు, ఇండస్ట్రీలకు, వ్యాపారస్తులకు, పర్సనల్స్‌కు తక్కువ వడ్డీకి సహాయం చేయబడును. సంప్రదించండి: Ph : 7997441253 [H-788227]

BUSINESS OFFER

■కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9311685170. [T-1258784]

GOLD FINANCE

■బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి, ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సం॥ ✆ 96590 57777. [O-191985]

Wanted

■Hyderbad లోని Zepto కంపెనీలో పనిచేయుటకు డెలివరి బాయ్స్ / గర్ల్స్ కావలెను. జీతం + బైక్ + హాస్టల్ వసతి కూడా కలదు.సంప్ర॥✆ 8919015932 [O-192024]

■ప్రకాశం జిల్లా, ఒంగోలులో ప్రముఖ రియల్ ఎస్టేట్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. సంప్రదించండి. ✆ 9866148820, 9440842447. [O-192021]

■రాయల్ మల్టీస్పెషాలిటి హాస్పిటల్ సుందరయ్య భవన్‌రోడ్, ఒంగోలు నందు పనిచేయుటకు ఆపరేషన్ థియేటర్ సిస్టర్స్, రిసెప్షనిస్ట్, వాచ్‌మెన్, PRO కావలెను. సం॥ ✆ 9618800333, 9618460006. [O-759035]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221881]

■మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221928]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీ: 18K ఫోన్ : 9640258899/ 9640468899 [H-793657]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ :
ఒంగోలు
90102 02856
90102 02762

ఫొటోగ్రాఫర్‌పై స్నేహితుల దాడి

- సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టింగ్
- ఆర్థిక లావాదేవీలే దాడికి కారణం
- నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వీరరాఘవరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

గిద్దలూరు రూరల్: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఓ ఫొటోగ్రాఫర్‌పై స్నేహితులే దాడికి పాల్పడిన సంఘటన గురువారం గిద్దలూరు పట్టణంలో చోటుచేసుకుంది. దాడి ఘటనను వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయింది. ఈ ఘటనలో ప్రధాన నిందితుడిని అరెస్టు చేశామని డీఎస్పీ వీరరాఘవరెడ్డి తెలిపారు. గిద్దలూరు పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో దాడి కేసు వివరాలు వెల్లడించారు. రాచర్లకు చెందిన ఫొటోగ్రాఫర్ శ్యామ్‌సుందర్‌రాజు గిద్దలూరులో నివాసం ఉంటున్నాడు. శ్యామ్ సుందర్‌కు అరవింద్ అనే వ్యక్తికి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో గత కొంత కాలంగా వివాదం నడుస్తోంది. తనకు రావాల్సిన డబ్బు ఇవ్వలేదని ఆగ్రహించిన అరవింద్, అతని స్నేహితులైన జైపాల్, తేజతో కలిసి శ్యామ్ సుందర్‌పై దాడికి పాల్పడ్డారు. అనంతరం గిద్దలూరులోని ఓ బార్‌లో రాజీ చర్చలకు వెళ్లి మద్యం తాగారు. అక్కడ కూడా వారి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దిగారు. తొలిసారి దాడి ఘటనను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి తేజ అనే యువకుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ విషయం గిద్దలూరు ఎస్సై అజిత దృష్టికి రావడంతో శ్యామ్ సుందర్‌ను పిలిచి విచారించారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు అరవింద్, మరో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు డీఎస్పీ వీరరాఘవరెడ్డి పేర్కొన్నారు. విలేకర్ల సమావేశంలో కంభం సీఐ రాజేష్, గిద్దలూరు ఎస్సై అజిత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

మర్రిపూడి: బహిర్భూమికి వెళ్లి వస్తున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మర్రిపూడి మండలంలోని విజయలక్ష్మీపేటలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. క్షతగాత్రుల బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని సన్నమూరు గ్రామానికి చెందిన బోడెపోగు ఎర్రయ్య హైదరాబాద్‌లో బేల్దారి పని చేసుకుని వారం రోజుల క్రితం ఇంటికి చేరుకున్నాడు. తన కుమారుడు అనారోగ్యంగా ఉండటంతో మరో కుమారుడిని కూడా వెంటబెట్టుకుని చీమకుర్తిలో వైద్యశాలకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జువ్విగుంట వద్ద పూటుగా మద్యం తాగి స్వగ్రామానికి బయలు దేరాడు. విజయలక్ష్మీపేట శివారులో అదే గ్రామానికి చెందిన నీలిశెట్టి చిన్న యోగయ్య బహిర్భూమికి వెళ్లి వస్తుండగా బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో నీలిశెట్టి చిన యోగయ్య రెండుకాళ్లు, కుడిచేయి విరిగాయి. బోడెపోగు ఎర్రయ్య, తన ఇద్దరు కుమారులు రోడ్డుపై పడిపోయారు. ఎర్రయ్య తలకు, మూడేళ్ల కుమారుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఎర్రయ్య పరిస్థితి విషమించి కోమాలోకి వెళ్లాడు. మెరుగైన వైద్యం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారని బంధువులు చెప్పారు.



ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్న యోగయ్య

కేంద్ర పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



గుండమాల గ్రామస్తులతో మాట్లాడుతున్న ఐఏఎస్ రామచంద్రుడు

గుండమాల(కొత్తపట్నం): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రత్యేక అధికారి, ఐఏఎస్ ఎం.రామచంద్రుడు పేర్కొన్నారు. గురువారం కొత్తపట్నం మండలంలోని గుండమాల గ్రామంలో సర్పంచ్ కారాని జయరావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 17 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. లబ్ధిదారుల అనుభవాలు తెలుసుకోవడంతో పాటు పథకాలు అందని వారిని గుర్తించి, అర్హులుగా చేయడమే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. వ్యవసాయం, ఆరోగ్య, సంక్షేమ, సాంకేతిక రంగాల్లో దేశం మరింత అభివృద్ధి చెందేందుకు 2047 వరకు చేపట్టాల్సిన చర్యలపై కేంద్రం ప్రణాళిక రూపొందించిందని చెప్పారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. పంటలపై పురుగు మందులు పిచికారీ చేసేందుకు డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. స్వయం సహాయక సంఘాలు, రైతు సంఘాలకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలతో ఉపాధిని మెరుగుపరుచుకుని పేదరికాన్ని జయించాలని సూచించారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర పథకాలతో పాటు రాష్ట్ర పథకాలను మెరుగ్గా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారు ఆర్థికంగా ఎదిగేందుకు పుష్కలంగా అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా జగనన్న పాలన



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

కనిగిరి రూరల్: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ప్రజా రంజకంగా, పారదర్శకంగా సాగుతోందని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ పేర్కొన్నారు. సంక్షేమ లబ్ధిని వివరించి, సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. గురువారం సాయంత్రం కనిగిరి మండలంలోని చినఇర్లపాడు పంచాయతీలో పార్టీ నేతలతో కలిసి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన సాగుతోందన్నారు. పార్టీలకతీతంగా, అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తుండటంతో ప్రతి గడపలో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో సైతం నవరత్నాలు పథకాలు అమలు చేసి రాష్ట్ర ప్రజలను ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసి దేశంలోనే ఆదర్శ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని కొనియాడారు. టీడీపీ నేత చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ ఓట్ల కోసం ఉత్తుత్తి హామీలతో వస్తున్నారని, వారిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మహిళలను మోసం చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు ఇచ్చిన 600 హామీలను గాలికొదిలేసి ప్రజలను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు లబ్ధి చేకూరిందని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. తొలుత ఎమ్మెల్యే బుర్రాకు సర్పంచ్ ముద్దా దానమ్మ, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, సంగు వెంకటేశ్వరరెడ్డి, ముద్దా బాబు, డీలర్ కృష్ణారెడ్డి, ఆవుల వెంకటరెడ్డి, వడ్డే రవి, గుత్తిగట్టి యోగయ్య, స్థానిక నాయకులు స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, సర్పంచ్ మూలె గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న అధికారులు



కొండపి జూనియర్ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

- జిల్లా ఉపాధి కల్పనాధికారి భరద్వాజ

కొండపి(సింగరాయకొండ): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకోసం జాబ్‌మేళాలు నిర్వహిస్తోందని జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ పేర్కొన్నారు. కొండపి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ ఆధారంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రతి నెలా అన్ని నియోజకవర్గాల్లో జాబ్‌మేళాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు అన్ని నియోజకవర్గాల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పీఎంకేవై 4.0లో భాగంగా కొండపిలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో 120 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, రిటైల్ అసోసియేట్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం కాలేజీ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ను ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం మాట్లాడుతూ.. జాబ్‌మేళాకు 280 మంది యువత హాజరు కాగా 79 మంది ఎంపికయ్యారని, వీరిలో 27 మందికి కంపెనీ ఆఫర్ లెటర్స్ అందజేశామని వివరించారు. ఎంపీడీఓ రమణమూర్తి, ట్రైనర్ అజయ్‌కుమార్, సీడాప్ అధికారులు ఇమాంబీ, రాజేష్, రమేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి పాల్గొన్నారు.